ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 3 జనవరి 2024 | 5



పీకేశారు!



- జిల్లాలో ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు షాక్
- వచ్చే ఎన్నికల్లో సీటు ఇవ్వకుండా పీకిపారేసిన వైసీపీ అధిష్ఠానం
- పనితీరు బాగోకపోవడం, వచ్చే ఎన్నికల్లో ఓడిపోతారనే సాకుతో టిక్కెట్ నిరాకరణ
- శూన్యంగా పర్వత ప్రసాద్, జ్యోతుల చంటిబాబు, పెండెం దొరబాబుల రాజకీయ భవిష్యత్
- వీరి స్థానంలో ప్రత్తిపాడు సీటు వరుపుల సుబ్బారావు, జగ్గంపేట నరసింహం, పిఠాపురం సీటు గీతకు
- పనితీరు బాగోలేదంటూ టిక్కెట్ ఇవ్వకపోవడంతో కుతకుతలాడుతున్న సిట్టింగ్‌లు
- ఇప్పటికే పవన్‌ను కలిసిన జ్యోతుల చంటిబాబు.. రేపోమాపో జనసేన తీర్థం
- అటు పెండెం దొరబాబు సైతం పార్టీ మారుతారని ప్రచారం.. గమ్యం తోచని రీతిలో పర్వతప్రసాద్
- జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లను మార్చుతున్నట్టు ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

అనుకున్నట్టే పక్కన పెట్టేశారు. సర్వేల సాకుతో, మళ్లీ నెగ్గరనే మిషతో వైసీపీ అధిష్ఠానం జిల్లాలో ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం ఎమ్మెల్యేలపై వేటేసింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ లేదని చెప్పేసింది. ఈమేరకు వారి స్థానంలో కొత్త ఇంఛార్జులను అధికారికంగా ప్రకటించింది. తద్వారా ఇంతకాలం తమ టిక్కెట్‌కు ఢోకా లేదని ధీమాగా ఉన్న ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలకు జగన్ షాక్ ఇచ్చారు. వారి రాజకీయ భవిష్యత్తును సమాప్తం చేసేశారు. అంతేకాదు ఇంతకాలం నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా పెత్తనం చేసిన చోటే మరోకరి కింద పనిచేయాలని పార్టీ హుకుం జారీ చేసినట్టయింది. దీంతో ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యేలు కుతకుతలాడుతున్నారు. కాగా పీకేసిన ఎమ్మెల్యేల స్థానంలో ప్రత్తిపాడు టిక్కెట్ మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు, జగ్గంపేట టిక్కెట్ మాజీ మంత్రి తోటనరసింహంకు, పిఠాపురం సీటు ప్రస్తుత కాకినాడ ఎంపీ వంగా గీతకు ప్రకటించారు. అయితే వైసీపీ అధిష్ఠానం సీటు చింపేసిన నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు వైసీపీ నుంచి జారుకోవడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు పవన్‌ను కలవడంతో జనసేనలో చేరిక ఖాయమనే సంకేతాలు పంపారు. పిఠాపురం ఎమ్మెల్యే సైతం అడుగులు అటువైపే అన్నట్టు సాగుతున్నాయి. పర్వత మాత్రం దిక్కుతోచని స్థితిలో ఉన్నట్టు ఆయన వర్గీయులు చెబుతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యేలకు షాక్ తగిలింది. ఇంతకాలం వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఓ వెలుగు వెలిగి, నియోజకవర్గాల్లో తమకు ఎదురేలేదన్నట్టు వ్యవహరించిన వీరి ముగ్గురికి వైసీపీ అధినేత జగన్ టిక్కెట్ చింపేశారు. రాబోయే ఎన్నికల్లో వీరికి సీటు ఇవ్వకుండా పక్కన పెట్టేశారు. వీరి స్థానాల్లో కొత్త ఇంఛార్జులను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం మంగళవారం రాత్రి ఓ ప్రకటన జారీచేసింది. దీంతో ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యేలు వైసీపీ అధిష్ఠానంపై కుతకుతలాడుతున్నారు. ఇన్నేళ్లుగా పార్టీ చెప్పిన పనులు చేస్తూ, ఊడిగం చేస్తే ఇప్పుడు సర్వే పేరుతో టిక్కెట్లు నిరాకరించడంపై భగ్గుమంటున్నారు. ఇదేనా న్యాయం అంటూ నిప్పులు కక్కుతున్నారు. నియోజకవర్గాల్లో గడపగడప, జగనన్న సురక్ష తదితర కార్యక్రమాల్లో తరచూ పాల్గొన్నా సరే పనితీరు బాగోలేదని, సర్వేలో వ్యతిరేక ఫలితాలు వచ్చాయనే నెపంతో టిక్కెట్ నిరాకరించడంపై ఈ ముగ్గురు భగ్గుమంటున్నారు. ప్రజా వ్యతిరేకత జగన్‌పైనా, వైసీపీపైనా ఉంటే తమను అకారణంగా బలిచేయడంపై ధ్వజమెత్తుతున్నారు. ఈనేపథ్యంలో తాజాగా మంగళవారం తమకు టిక్కెట్ నో చెప్పడంతో ఈముగ్గురు అజ్ఞాతంలోకి జారుకున్నారు. పార్టీ కార్యకర్తలు, అనుచరులకు సైతం దొరకకపోవడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ ఢోకా లేదని ఇంతకాలం ఈ ముగ్గురు ధీమాగా ఉన్నారు. అధిష్ఠానం ఆశీస్సులు, జిల్లా పార్టీ పరిశీలకుడు మిథున్‌రెడ్డితో పరిచయాలు తమ సీటుకు ఢోకాలేకుండా చేస్తుందని భావించారు. తీరా టిక్కెట్ చింపేయడంతో రాజకీయ భవిష్యత్తు శూన్యంగా మారడంతో నిస్సహాయంగా మారారు. అయితే ఈ ముగ్గురికి టిక్కెట్ ఇవ్వడం లేదంటూ పదిరోజుల కిందట సీఎం జగన్ పిలిచి చెప్పేశారు. కొత్త ఇంచార్జులతో పనిచేయాలని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' తన నాటి కథనంలో పేర్కొంది. ఈనేపథ్యంలో రాజకీయ భవిష్యత్తు చంపేసుకోకూడదన్న నిర్ణయంతో జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు ఇటీవల కాకినాడలో పవన్‌ను కలిశారు. జగ్గంపేట టిక్కెట్ జనసేన నుంచి కోరారు. కానీ దీనిపై స్పష్టత రాలేదు. అయితే త్వరలో చంటిబాబు జనసేనలో చేరడం ఖాయమని ఆయన వర్గీయులు చెబుతున్నారు. అటు పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో మకాం వేస్తున్నారు. ఈయన కూడా త్వరలో ఓ పార్టీలో చేరుతారని తెలిసింది. తాజా సీట్ల మార్పుతో జిల్లాలో ఈ నియోజకవర్గాల్లో వైసీపీ దాదాపు ఖాళీ కానుంది. వైసీపీ తీరుతో భారీగా కేడర్ సైతం రాజీనామాలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో కొత్త ఇంఛార్జులకు ఆదిలోనే పార్టీలో తలనొప్పులు మొదలుకాక తప్పదని చెబుతున్నారు.


వంగా గీత


తోట నరసింహం


వరుపుల సుబ్బారావు

కొత్త వాళ్లైనా కష్టమే...

ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు పీకేసిన వైసీపీ అధిష్ఠానం కొత్త ఇంఛార్జులను ప్రకటించింది. వీరిలో పిఠాపురం ఎమ్మెల్యే టిక్కెట్ కాకినాడ ఎంపీ వంగా గీతకు కేటాయించింది. ప్రస్తుతం ఆమె ఎంపీ సీటు నుంచి పోటీచేస్తే ఓడిపోతారని తేలడం, అటు పిఠాపురంలో ప్రస్తుత ఎమ్మెల్యే దొరబాబు గడ్డు పరిస్థితి ఎదుర్కోవడంతో ఈ మార్పులు చేసింది. అయితే ఎంపీ గీతకు ఇక్కడ టిక్కెట్ ఇచ్చినా వైసీపీ శ్రేణులు ఈమెకు సహకరించడానికి సిద్ధంగా లేవని చెబుతున్నాయి. అటు తమకు టిక్కెట్ నిరాకరించారనే ఆగ్రహంతో దొరబాబు వర్గీయులు సైతం వచ్చే ఎన్నికల్లో ఇక్కడ వైసీపీకి గుణపాఠం చెప్పాలని భావిస్తున్నారు. జగ్గంపేట సీటు చంటిబాబు స్థానంలో మాజీ మంత్రి తోట నరసింహంకు కేటాయించారు. గతంలో ఈయన 2004, 2009లో వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగాను పనిచేశారు. అయితే ఇక్కడ చంటిబాబు ఈసారి గెలవరనే కారణంతో తోటకు వైసీపీ టిక్కెట్ కేటాయించింది. అయితే ఈయన కూడా గడచిన ఏడాదిన్నర నుంచి జగ్గంపేట టిక్కెట్ తనదేనంటూ ప్రచారం చేసుకుంటూ తిరుగుతున్నారు. దీంతో ప్రస్తుత ఎమ్మెల్యే చంటిబాబు, తోటకు మధ్య ఈ విషయంలో పరోక్షంగా గొడవలు కూడా జరిగాయి. వారి వారి అనుచరుల మధ్య తీవ్ర గందరగోళం నెలకొంటూ వచ్చింది. ఇప్పుడు అనుకున్నట్టే టిక్కెట్ తోటకు రావడంతో చంటిబాబు వర్గీయులు కుతకుతలాడిపోతున్నారు. ఈనేపథ్యంలో వేరే పార్టీ నుంచి అయినా టిక్కెట్ తెచ్చుకుని తోటను ఓడించాలనే పట్టుదలతో చంటిబాబు వర్గీయులున్నారు. మరోపక్క ప్రత్తిపాడు సీటు నుంచి పర్వత ప్రసాద్‌ను తప్పించి ఆయన స్థానంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు కేటాయించారు. ఈయన 2004,2014లో రెండుసార్లు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తిరిగి వైసీపీలో టిక్కెట్ కేటాయించారు. అయితే పర్వతకు, వరుపులకు మధ్య పరిస్థితి ఏం బాగోలేదు. ఎమ్మెల్యేగా తను ఉండగా, వరుపులను పార్టీలో చురుగ్గా ఉండాలని వైసీపీ ఏడాదిన్నర కిందట ఆదేశించింది. కానీ దీన్ని దిగమింగుకోలేక పర్వత ప్రసాద్ వరుపుల సుబ్బారావును నానా ఇబ్బందులకు గురి చేశారు. ఇప్పుడు టిక్కెట్ పర్వతను తప్పించి వరుపులకు ఇవ్వడంతో నియోజకవర్గంలో వైసీపీ రాజకీయం రసవత్తరంగా మారనుంది. ఈ రెండు వర్గాల జగడంలో వైసీపీ పరిస్థితి మరింత దారుణంగా దిగజారనుందని సొంత పార్టీ నాయకులే చెబుతున్నారు.


పెండెం దొరబాబు


జ్యోతుల చంటిబాబు


పర్వత ప్రసాద్

అధినేతలు ఆగయా..



- నేడు సీఎం జగన్ కాకినాడ రాక
- ఉదయం 10.30గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు హెలికాప్టర్‌లో రాక
- 10.40గంటలకు రంగరాయ మెడికల్ కాలేజీ మైదానంలో బహిరంగ సభకు హాజరు
- ఇక్కడి నుంచే పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక నిధులు విడుదల
- అనంతరం 12 నుంచి 1 గంట వరకు జిల్లా పార్టీ నేతలతో హెలీప్యాడ్ వద్ద సమీక్ష
- ఆ తర్వాత తాడేపల్లికి పయనం : సీఎం సభకు జిల్లావ్యాప్తంగా భారీ జనసమీకరణ
- పింఛన్‌దారులంతా ఉదయం ఏడుకే రాకపోతే డబ్బులు రావని బెదిరింపులు
- అటు జనాన్ని తరలించేందుకు అయిదు జిల్లాల నుంచి 318 బస్సులు ఏర్పాటు
- మరోపక్క ఈనెల 4న పవన్ కాకినాడకు రాక.. మూడు రోజులు ఇక్కడే మకాం
- కాకినాడ సిటీ, ఉమ్మడి తూ.గో. జిల్లాల నియోజకవర్గాలపై సమీక్ష
- ఈనెల 10న తుని రానున్న టీడీపీ అధినేత చంద్రబాబు.. లక్ష మందితో సభ
- ఈనెల 20న అమలాపురం పార్లమెంట్ పరిధిలోని మండపేటలో బాబు సభ
- ఈనెల 27న రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని గోపాలపురంలో సభ

నేటి నుంచి జీఎన్ఎం పరీక్షలు

జీజీహెచ్ (కాకినాడ) జనవరి 2: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలు ఈనెల 11 వరకు జరగనున్నాయి. కాగా గతంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈ పరీక్షలు జరిగేవి. అయితే రద్దీ పెరిగిపోయిన దృష్ట్యా ప్రస్తుతం ఈ పరీక్షలను కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలలో నిర్వహించనున్నారు. మొత్తం 53 నర్సింగ్ స్కూల్స్‌కు సంబంధించి 32 స్కూళ్లకు చెందిన 1700 మంది నర్సింగ్ విద్యార్థులు రంగరాయ వైద్య కళాశాలలోను, 10 స్కూళ్లకు చెందిన 350 మంది రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీలోను, 11 నర్సింగ్ స్కూళ్లకు చెందిన 450 మంది విద్యార్థులు అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీలోను పరీక్షలు రాయనున్నారు. బుధవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జీఎన్ఎం ప్రథమ సంవత్సరం, మధ్యహ్నం 2 నుంచి 5 గంటల వరకు తృతీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరగనుండగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ఎస్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షల నిర్వహణ కోసం 25 మంది పరిపాలన విభాగ సిబ్బంది ఇన్విజిలేటర్‌లుగా వ్యవహరించనున్నారు. విద్యార్థుల సౌలభ్యత కోసం ఆరుగురు అటెండర్‌లను నియమించారు. సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పుష్కర్‌రావు, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ ఈ పరీక్షలను పర్యవేక్షించనున్నారు. అలాగే చీఫ్ ఎగ్జామినర్‌గా ప్రభుత్వం నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆషాదేవి వ్యవహరించనున్నారు. విద్యార్థులు స్లిప్‌లతో దొరికినా, మాస్ కాపీయింగ్‌కు పాల్పడినా డీబార్ చేయడంతోపాటు మరోసారి పరీక్ష రాసేందుకు అనర్హులవుతారని డాక్టర్ లావణ్యకుమారి హెచ్చరించారు. క్లినికల్స్ చేయని ఏ విద్యార్థినీ పరీక్ష రాసేందుకు అనుమతించబోమని చెప్పారు.

జగన్ పర్యటన కోసం పాఠశాలలకు సెలవు

పిఠాపురం/గొల్లప్రోలు, జనవరి 2: సీఎం జగన్ పర్యటన ఉందంటే చాలు విద్యాసంస్థలు ఉలిక్కిపడుతున్నాయి. అయన పర్యటన కోసం పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల బస్సులన్నింటిని అధికారులు తీసుకుంటుండడంతో సెలవులు ప్రకటించక తప్పడం లేదు. కాకినాడలో బుధవారం సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు మండలాల్లోని ప్రైవేటు విద్యా సంస్థలు అన్నింటికి సెలవు ప్రకటించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లోకల్ హాలీడేగా ప్రకటించామని ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. సీఎం పర్యటనకు వచ్చినప్పుడల్లా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మెడకు ఉరితాళ్లు తగిలించుకుని సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

ఉరితాళ్లతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

- 8లో


పిఠాపురంలో దున్నపోతుకు అంగన్‌వాడీ వర్కర్ల వినతిపత్రం

అంగన్‌వాడీల వినూత్న నిరసనలు

ప్రభుత్వం పట్టించుకోవడంలేదని దున్నపోతులకు వినతులు

- 8లో

తెలుగు మహాసభల 'శోభాయాత్ర'

- 7లో

అధినేతలు ఆగయా..

నేడు సీఎం జగన్ కాకినాడ రాక

రేపు పవన్ కాకినాడకు రాక: మూడు రోజులు అక్కడే మకాం

10న తుని రానున్న టీడీపీ అధినేత చంద్రబాబు:లక్ష మందితో సభ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల వేడి ఊపందుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల అధినేతల వరుస పర్యటనలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వేడెక్కుతోంది. ముంచుకొస్తున్న అసెంబ్లీ ఎన్నికల సమరాన్ని ముందే తెచ్చేస్తోంది. ఇందుకు నిదర్శనమే జిల్లాలో సీఎం జగన్, జనసేన అధినేత పవన్, టీడీపీ అధినేత చంద్రబాబుల వరుస పర్యటనలు.. సభలు నిర్వహిస్తున్న తీరు. రోజుల వ్యవధిలోనే ఈ ముగ్గురు అధినేతలు జిల్లాలోకి అడుగుపెట్టబోతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన సంక్షేమంపై చెప్పుకోవడానికి సీఎం జగన్ నేడు కాకినాడ పర్యటిస్తుండగా, ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తుతూ పోరాడుతున్న జనసేన అధినేత పవన్ ఈనెల 4న, టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10, 20, 27 తేదీల్లో మూడు పార్లమెంట్ కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించబోతున్నారు. దీంతో ఈ మూడు పార్టీల రాజకీయ కార్యకలాపాలతో హోరెత్తనుంది.

సీఎం వస్తున్నారు...జనాన్ని తీసుకురండి

సీఎం జగన్ బుధవారం కాకినాడ నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 9.40 గంటలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయలుదేరి 10.20 గంటలకు కాకినాడ పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు షో ద్వారా 10.40 గంటలకు రంగరాయ మెడికల్ కాలేజీ మైదానానికి చేరుకుంటారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్ కానుక నిధులను జగన్ విడుదల చేస్తారు. ఈనెల నుంచి రూ.3 వేల పెన్షన్ డబ్బులను చెల్లిస్తున్న నేపథ్యంలో దాన్ని ప్రచారం చేసుకోవడానికి వీలుగా అక్కడే భారీ బహిరంగసభలో సీఎం ప్రసంగించనున్నారు. తిరిగి 12 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ గంటపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి తాడేపల్లికి పయనమవుతారు. బహిరంగ సభకు ముందు కాకినాడ నగరంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి సీఎం జగన్ ప్రారంభోత్సవాలను చేయనున్నారు. సభావేదికకు సమీపంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను జగన్ ఆవిష్కరిస్తారు. కాగా సీఎం జగన్ సభకు వేలల్లో జనాలను తరలించేందుకు ప్రభుత్వం అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి జనాలను తరలించేందుకు పార్టీ నేతలు, అధికారులకు టార్గెట్లు విధించింది. ప్రధానంగా వలంటీర్లు అయితే తమ పరిధిలోని పింఛన్‌దారులను బెదిరిస్తూ ఆడియో మెసేజ్‌లు పంపారు. తమ సమీపంలోని సచి వాలయాలకు పెన్షన్‌దారులు బుధవారం ఉదయం ఏడుకు చేరుకోవాలని, అక్కడి నుంచి సీఎం సభకు వెళ్లాలని హుకుం జారీ చేశారు. రాకపోతే పెరిగిన పెన్షన్ డబ్బులు అందవని కూడా హెచ్చరించారు. ఈ మేరకు కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఓ వలంటీర్ బెదిరింపుల ఆడియో బయటకు లీకైంది. మరోపక్క ప్రతిపక్ష టీడీపీ నిర్వహించే కార్యక్రమాలకు ఒక్క బస్సు కూడా అద్దెకు ఇవ్వని ఆర్టీసీ, సీఎం సభ కోసం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి 318 బస్సులను పంపుతోంది. ఆయా జిల్లాల నుంచి సీఎం సభ కోసం ఇవన్నీ బుధవారం ఉదయం కాకినాడకు చేరుకోనున్నాయి.

మూడు రోజులు పవన్ ఇక్కడే...

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 4న కాకినాడకు రానున్నారు. మూడు రోజుల పాటు ఓ ప్రైవేటు అతిథిగృహంలో బసచేయనున్నారు. తొలిరోజు కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి 28 వార్డులపై విడివిడిగా సమీక్షించనున్నారు. ఆ తర్వాత కాకినాడ రూరల్, అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 12 నియోజకవర్గాలపై సమీక్షిస్తారు. వాస్తవానికి గత నెల 27 నుంచి పవన్‌కల్యాణ్ కాకినాడలో మూడు రోజులు మకాం వేశారు. కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలపై కూలంకుష సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలపై సమీక్షించారు. ఎక్కడ పోటీచేస్తే బాగుంటుంది? ఎక్కడ ఇంకా పార్టీ మరింత బలోపేతం అవ్వాలి? అనేదానిపై ఇంఛార్జులతో సమీక్షించారు. ఆ తర్వాత మరో రెండు రోజులు ఏకంగా కాకినాడ సిటీ నియోజకవర్గంపై సమీక్షించారు. తద్వారా కాకినాడ సిటీ నుంచి అసెంబ్లీకి పవన్ పోటీ చేస్తారనే ప్రచారానికి మరింత బలం కల్పించారు. తిరిగి మళ్లీ ఈనెల 4 నుంచి మూడు రోజులు ఇక్కడే మకాం వేయడం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. పవన్ కాకినాడలో ఉన్నప్పుడే జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆయన్ను కలిశారు. దీంతో వైసీపీ వర్గాలకు భారీ షాక్ తగిలింది. వైసీపీ ఎమ్మెల్యే నేరుగా పవన్ కలవడం జనసేనలో చేరడానికేననే ప్రచారం బలపడింది. అయితే రెండో విడత కాకినాడకు పవన్ వస్తున్న నేపథ్యంలో ఈసారి వైసీపీ నుంచి ఎంతమంది ఎమ్మెల్యేలు వస్తారోననే భయం అధికార పార్టీకి కునుకులేకుండా చేస్తోంది. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను వైసీపీ తప్పించాలని నిర్ణయించింది. వీరిలో ఒకరు ఇప్పటికే పవన్‌ను కలవగా, మిగిలిన ఇద్దరిలో ఎవరు ఏ నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.

లక్ష మందితో దద్దరిల్లేలా...

టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10న తునికి వస్తున్నారు. ఆరోజు లక్ష మందితో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. జగన్ ప్రభుత్వ అరాచకాలు, అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభల ద్వారా విరుచుకుపడుతున్న చంద్రబాబు అందులోభాగంగా కాకినాడ పార్లమెంట్‌కు సంబంధించి సభను తునిలో నిర్వహిస్తున్నారు. తొలుత పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటన ఖాయం అయినా ఆ తర్వాత వేదిక తునికి మార్చారు. ఆరోజు కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి లక్షమందికిపైగా తునికి చేరుకునేలా జిల్లా టీడీపీ సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి సంక్రాంతి తర్వాత సభ నిర్వహించాలని భావించారు. కానీ ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో వాయిదా వేయకుండా సభ జరపాలని పార్టీ వర్గాలు నిర్ణయించాయి. మరోపక్క డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం పార్లమెంట్ పరిధిలో సభను మండపేటలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు జనవరి 20వ తేదీ ఖరారు చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో గోపాలపురంలో ఈనెల 27న చంద్రబాబు బహిరంగ సభను లక్ష మందితో నిర్వహించనున్నారు. కాగా ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించింది. పార్టీలో ఎనలేని ఉత్సాహాన్ని నింపి క్యాడర్‌లో విజయోత్సాహాన్ని నింపింది. తిరిగి స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టై బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు మళ్లీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మూడు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తుండడం విశేషం.

సంక్రాంతికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, జనవరి 2: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రైలు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్ పరిధిలో సామర్లకోట మీదుగా పలు సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి సమాచారం అందింది. 07093 నంబరు గల సికింద్రాబాద్-బెరహమ్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 8,15 తేదీలలో రెండు ట్రిప్‌లు బయలుదేరనున్నాయి. ఈ రైలు సోమవారం సికింద్రాబాద్‌లో రాత్రి 7.45 నిమిషాలకు బయలుదేరి బుధవారం ఉదయం 6 గంటలకు బెరహమ్‌పూర్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో పిడుగురాళ్ళ, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి మీదుగా సామర్లకోటకు తెల్లవారుజామున 3.45కి చేరుకుని అన్నవరం 4.15కి చేరుకుని అనకాపల్లి మీదుగా బెరహమ్‌పూర్‌కు మంగళవారం ఉదయం 11.15కి చేరుకుంటుంది. 07094 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారంలో జనవరి 9,16లలో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి దువ్వాడకు సాయంత్రం 5.30కి చేరుకుంటుంది. అన్నవరానికి రాత్రి 6.23కి చేరుకుంటుందని, సామర్లకోటకు రాత్రి 7.08కి చేరుకుంటుందన్నారు. రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, పిడుగురాళ్ల మీదుగా సికింద్రాబాద్‌కు బుధవారం ఉదయం 6 గంటలకు చేరుకుంటుంది. 07272 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-సికింద్రాబాద్ మధ్య జనవరి 12న శుక్రవారం బయలుదేరనుంది. 07271 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-కాకినాడ మధ్య జనవరి 13న శనివారం బయలుదేరనుంది. మరిన్ని వివరాలకు, రైలు రిజర్వేషన్ టిక్కెట్లకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి సూచించారు.

నకిలీ ఏసీబీ అధికారి అరెస్టు

15 ఏళ్లుగా మోసాలు..ఉద్యోగులను బెదిరించి రూ.లక్షల్లో వసూలు

మండపేట, జనవరి 2: ఏసీబీ ముసుగులో మోసాలు చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మూడు రాష్ట్రాల్లో అతడిపై 100 పైగా కేసులు నమోదై ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడు రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మంగళవారం వివరాలు తెలిపారు. మండపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న వేంకటేశ్వరరావుకు గతేడాది డిసెంబరు 14న ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను ఏసీబీ అధికారిగా పరిచయం చేసుకుని 'మీరు రిటైర్‌మెంట్ దగ్గరలో ఉన్నారు, మీపై ఏసీబీ దాడి జరిగితే మీకు రావల్సిన బెనిఫిట్స్ రావు' అని బెదిరించి అతడి వద్ద నుంచి రెండు విడతలుగా రూ.3.5 లక్షలు నగదు కాజేశాడు. తర్వాత ఏఎస్ఐ తాను మోసపోయానని గ్రహించి డిసెంబరు 16న మండపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతపురం జిల్లా కదిరి నియోజకర్గ పరిధిలోని పట్నం మండలం మల్లికవేలమ గ్రామానికి చెందిన రాచంపల్లి శ్రీనివాసులు(వాసు) ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. 15 ఏళ్ల నుంచి ఇలా ఉద్యోగులే లక్ష్యంగా చేసుకుని ఏసీబీ ముసుగులో నేరాలకు పాల్పడుతున్నాడని డీఎస్పీ తెలిపారు. శ్రీనివాసులపై ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో కేసులు నమోదయ్యాయని, శిక్షలు కూడా అనుభవించాడని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో మండపేట రూరల్ ఎస్ఐ బళ్ల శివకృష్ణ తన సిబ్బందితో సీఐ శ్రీధర్‌కుమార్ సహకారంతో కర్నాటక రాష్ట్రం బెంగళూరు వెళ్లి అక్కడ పోలీసుల సహాయంతో బెంగళూరులో ఉంటున్న శ్రీనివాసులు కదలికలను గుర్తించారు. నిందితుడు శ్రీనివాసులు మంగళవారం ఉదయం రాజ మహేంద్రవరం రైల్వేస్టేషన్ నుంచి విశాఖకు వెళ్లేందుకు సమా యత్తమవుతున్న సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అతడిపై దాడి చేసి పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.2.5 లక్షలు నగదును స్వాధీనం చేసు కుని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి ఆలమూరు కోర్టుకు మంగళవారం హాజరుపర్చినట్టు డీఎస్పీ తెలిపారు. కోర్టు అతడికి రిమాండ్ విధించిందని తెలిపారు. నిందితుడు శ్రీనివాసులు డబ్బులు వసూలు చేసే విషయంలో చాలా తెలివిగా వ్యవహరించేవాడు. నేరుగా డబ్బును తన అకౌంట్‌లో కాకుండా ఇతర వ్యక్తుల అకౌంట్‌లోకి వేయమనేవాడు. ఆటోడ్రైవర్లను, రోడ్లపై చిరు వ్యాపారులతో మాట్లాడి డబ్బు అత్యవసరమని, తన ఫోన్ పనిచేయడం లేదని చెప్పి వారి ఖాతాల్లో డబ్బులు వేయించేవాడు. ఉద్యోగులు ఏసీబీ పేరిట వచ్చే ఫేక్ కాల్స్‌కు భయపడవద్దని నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని డీఎస్పీ కోరారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, ఎస్ఐ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం అధికారులపై కేసుల నమోదుకు చర్యలు'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: కృష్ణునిపాలెం భూసేకరణలో పోలవరం అధికారులపై కేసులు నమోదుకు చర్యలు చేపట్టారని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. రాజమహేంద్రపురం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో భూసేకరణ చేసినప్పటి నుంచి ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదని, ఆర్‌అండ్‌ఆర్ వర్తింపజేయలేదన్నారు. అసలు పట్టాదారులకు చట్టప్రకారం చెల్లించవలసిన భూమి నష్టపరిహారం వేరే వ్యక్తులకు చెల్లించారని దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించి ఈ అవకతవకలకు బాధ్యులుగా ఆరుగురు అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మాధవీలత నివేదిక సమర్పించారని వివరించారు. రాజమండ్రి రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన ఎం.జితేంద్ర, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు (భూసేకరణ), స్పెషల్ కలెక్టర్ సీహెచ్ భానుప్రసాద్, పోలవరం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన పీవీవీ గోపాలకృష్ణలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని వెల్లడించారు. అధికారుల చర్యల వల్ల నష్టపోయిన వారంతా ఎస్టీ కులస్థులు కనుక అధికారులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేసినందుకు ఐపీసీ 409, అసలు పట్టాదారులను మోసం చేసినందుకు ఐపీసీ 420 ప్రకారం కేసులు నమోదు చేయాలని బాధితులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. భూములు కోల్పోయిన అసలు పట్టాదారులకు చట్ట ప్రకారం నష్టపరిహారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వెంటనే చెల్లించాలని కోరారు. పట్టాదారుల వారసులు దిబ్బ శ్రీను, దిబ్బ రమణ, బంటుమిల్లి అచ్చియమ్మ, బంటుమిల్లి రాజేశ్వరి, గరుగుపల్లి జోగరావు, గరుగుపల్లి రాము, ఆదివాసీ మహాసభ కార్యదర్శి అరగంటి వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

మోతుగూడెం, జనవరి 2: సీలేరు నుంచి విజయవాడకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను మోతుగూడెం ఎస్ఐ బి.గోపాలరావు, పోలీసు సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. విజయవాడ లబ్బీపేటకు చెందిన షేక్ ఫహీం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనమాక గ్రామానికి చెందిన చల్లా హరినాథ్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం బురగగూడెం గ్రామానికి చెందిన నందిపాటి వంశీ కృష్ణారెడ్డి గంజాయిని రహస్యంగా ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తున్నారు. మోతుగూడెం వద్ద వాహనాలను తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రూ.50 వేల విలువ చేసే పది కిలోల గంజాయి, ఏపీ37 బీఏ 0333 నంబరుతో ఉన్న స్కార్పియో కారు, ఏపీ07 సీఎక్స్ 3368 నంబరుతో ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ స్వాధీనం చేసుకున్నారు

తెలుగు మహాసభల 'శోభాయాత్ర'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5,6,7 తేదీల్లో గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో వైభవంగా అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాజమహేంద్రవరం పురవీధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సభలకు సంఘీభావంగా అప్సా ఆధ్వర్యంలో చేపట్టిన తెలుగు భాషా వైభవ శోభాయాత్ర కంబాలచెరువు దండిమార్చ్ సెంటర్ నుంచి పుష్కరాలరేవు రాజరాజనరేంద్రుడు విగ్రహం వరకు సాగింది. యాత్రకు విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం చైతన్య విద్యాసంస్థల అధినేత చైతన్యరాజుతో కలిసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాత్మానంద మాట్లాడుతూ ఎన్నో భాషలున్నా తెలుగు భాషను మరువకూడదని, తల్లిని ఎలా గౌరవిస్తామో అమ్మభాషను అలాగే గౌరవించాలన్నారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తుండడం అభినందనీయమని, వాటిని స్వరూపనందేంద్ర సరస్వతిస్వామి ప్రారంభిస్తారని, జయప్రదం చేయాలన్నారు. అనంతరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ ఎంతో మంది గవర్నర్లను, ప్రముఖులను ఆహ్వానిస్తూ నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చైతన్యరాజు మాట్లాడుతూ తెలుగు మహాసభల నిర్వహణకు గైట్‌లో ఏర్పాట్లు చేశామన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు మహాసభలకు టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో గైట్‌లో చతుర్వేద యజ్ఞం కూడా మొదలైందని, సభలను విజయవంతం చేయాలన్నారు. శోభాయాత్రలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రాజరాజ నరేంద్రుడు, నన్నయ, నారాయణ బట్టారకుల చిత్రాలను ఉంచారు. వేదపండితుల మంత్రాలు, ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ విద్యార్థుల బ్యాండ్ మేళం నడుమ అనేక మంది కవులు, సాహితీవేత్తలు, ప్రముఖుల ఫొటోలతో ప్రదర్శన చేశారు. రాజరాజ నరేంద్రుడు విగ్రహానికి రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, చిన్నవెంకన్నబాబు, ఆదిత్య డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, మంతెన కేశవ రాజు, బైర్రాజు ప్రసాద్, తెలుగు మహాసభల సమన్వయ కర్త సునంద రమేష్, సుమేధ రాజు, అప్సా అధ్యక్షుడు సుంకవల్లి మురళీ, కళ్యాణ్‌రెడ్డి, పి.శివాజీ, పి.సురేష్, ఈనీ సభ్యులు రమేష్, గంగాధర్, ఫ్యూచర్ కిడ్స్ నవి, ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సలహాదారుడు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, గౌరవాధ్యక్షుడు మండేల శ్రీరామమూర్తి పాల్గొన్నారు.




రాజమహేంద్రవరం నగరంలో శోభాయాత్ర



శోభాయాత్రకు హాజరైన విద్యార్థులు, నగర వాసులు

రెప్పపాటులో..

ముగ్గురిని బలి తీసుకున్న కారు..ఇద్దరు మహిళలు, చిన్నారి మృత్యువాత



రమాదేవి



దివ్యప్రియ



దేవరపల్లి/ కొవ్వూరు/ రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 : రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. కుటుంబంలో విషాదం నిండిపోయింది. దేవరపల్లి మండలం బంధపురం వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంతో బంధువులు కన్నీటిసంద్రంలో మునిగిపోయారు. నూతన సంవత్సర వేడుకలను ఎంతో ఆనందంగా జరుపుకుని బయలుదేరిన ఆ కుటుంబం.. అంతలోనే విషాదంలో మునిగిపోయింది. చూస్తుండగానే ప్రమాదం జరిగిపోయింది.. మృత్యువు డివైడర్ దాటుకుని వచ్చి ముగ్గురిని మింగేసింది. హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ మాక్స్ సొసైటీ ఏరియా, లింగంపల్లి సంగారెడ్డి జిల్లా ఆర్కే రామచంద్రపురం అక్కాతమ్ముళ్లు తమ తమ కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు గత నెల 30వ తేదీన రెండు కుటుంబాలకు చెందిన 8 మంది తమ సొంత కారులో వైజాగ్‌లోని తమ్ముడి అత్తవారింటికి వచ్చారు. రెండు రోజుల పాటు ఆనందంగా గడిపారు. వైజాగ్ చుట్టుపక్కల ప్రాంతాన్నీ తిరిగి చూశారు. సెలవులు అయిపోవడంతో మంగళవారం ఉదయం 10 గంటలకు వచ్చిన కారులోనే హైదరాబాద్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం 2 గంటలు అవుతుంది.. ఎక్కడైనా ఆగి భోజనం చేద్దామని అనుకుంటున్నారు. అంతలోనే కృష్ణా జిల్లా నందిగామ నుంచి వైజాగ్‌కు వెళుతున్న కారు డివైడర్ దాటుకుని వేగంగా దూసుకొచ్చి హైదరాబాద్ వైపు వెళుతున్న కారును ఢీకొట్టింది.. అంతే ఆ క్షణంలో ఏం జరిగిందో తెలియదు.. రెండు కార్లు తుక్కుతుక్కు అయిపోయాయి. అటుగా వెళ్లే ప్రయాణికులకు ఏం జరిగిందో అర్థం కాలేదు.. వాహనదారులు కాసేపటికి తేరుకుని కార్ల దగ్గరకు వెళ్లి చూశారు. రెండు కార్లలో 11 మంది ప్రయాణిస్తుండగా అందరూ తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సుభాష్ గౌడ్‌కు తీవ్రగాయాలు కాగా తల్లి రమాదేవి (50), భార్య దివ్యప్రియ(25) కొవ్వూరు ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మృతి చెందారు. కుమార్తె గనిష్క (19నెలలు) దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బావ మల్లికార్జున్, సోదరి స్వప్న, మేనల్లుడు విశ్వక్‌సాయి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డివైడర్ దాటుకుని వచ్చి ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న నందిగామకు చెందిన పాస్టర్ వేల్పూల విజయమోహన్, వేల్పూల సంజనీగ్రేస్, వేల్పూల రోహిన్, అమితశ్రీలు దేవరపల్లిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న వారు అంతా క్షేమంగానే ఉన్నారు. సంఘటన ప్రాంతాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం నుంచి తేరుకున్న సుభాష్ గౌడ్ తన కుటుంబీకులు ఎలా ఉన్నారని పలుమార్లు అడగడం కంటతడి పెట్టించింది. ఎందుకంటే అతనికి తన తల్లి, భార్య, కుమార్తె మృతిచెందారని తెలియదు. సీఐ అనసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నన్నయలో ప్లేస్మెంట్ డ్రైవ్

దివాన్‌చెరువు, జనవరి 2: ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధ, గురువారాలలో రెండు రోజులు ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జి.వి.కె.బయోసైన్సెస్ అర్బన్ లైఫ్‌సైన్స్ వారిచే నిర్వహిస్తున్న ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌కు ఉమ్మడిగోదావరి జిల్లాల్లో ప్రస్తుతం ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. రాతపరీక్ష ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్, హెచ్.ఆర్.రౌండ్ నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని జీవీకే బయోసైన్సెస్ అర్బన్ లైఫ్‌సైన్స్ సంస్థలో నెలకు రూ.27 వేల జీతంతో ఉద్యోగం కల్పిస్తారన్నారు. వివరాలకు విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌ను లేదా విశ్వ విద్యాలయం ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డిని సంప్రదించాలని తెలిపారు.

భారీగా ఎరువులు సీజ్

పి.గన్నవరం, జనవరి 2: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం శ్రీశ్రీనివాస జనరల్ ఏజెన్సీస్ ఎరువుల షాపుపై రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎరువులకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌కు గోడౌన్‌లో ఉన్న నిల్వలకు వ్యత్యాసం ఉండటంతో 10.600 మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.2,59,700 విలువ గల ఎరువులను సీజ్ చేసి సంబంధిత షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపుల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపినా, స్టాక్ నిల్వలు ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. తనిఖీల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారి కళ్యాణ్ సూర్యకుమార్, సిబ్బంది వీరబాబు, లోవరాజు ఉన్నారు.

14 వేల హెక్టార్లలో నష్టం

సీతానగరం, జనవరి 2: రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో పొగాకు పంట దెబ్బతిందని పొగాకు బోర్డు చైర్మన్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రఘుదేవపురంలో మంగళవారం ఆయన పొగాకు పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పొగాకు బోర్డు కేవలం రైతుల అవసరాలను గుర్తించి వారికి అనుకూలంగా ప్రభుత్వంతో చర్చించి పనులు చేయించడం తప్ప హామీలు నెరవేర్చే పరిస్థితి లేదన్నారు. పొగాకు రైతుల పరిస్థితి, పంట పాడైన విధానాన్ని ప్రయత్నలోపం లేకుండా అధికారులు, మంత్రుల వద్దకు తీసుకువెళ్లామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన రావడం లేదన్నారు. ఈ సందర్భంగా రైతుల తరఫున భారతీయ జనతాపార్టీ నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, పొగాకు బోర్డు సభ్యులు కాట్రగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు పొగాకు వేసిన తర్వాత ఆర్వెస్టింగ్ వరకు వచ్చిన పంట, అకాల వర్షాలకు దెబ్బతిందని, ఇప్పటికి ఈ ఏడాది మూడుసార్లు పంట వేశారని రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారన్నారు. రాజమహేంద్రవరం నుంచి పొగాకు బోర్డు తొలగించి దేవరాపల్లి బోర్డులో కలపడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, సబ్సిడీపై వచ్చే ఎరువులు కూడా రైతులకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆక్షన్ సూపరింటెండెంట్ జీఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సబ్సిడీపై ఎరువులు ఇవ్వడానికి బోర్డుకు అభ్యంతరం లేదని, కానీ రైతు కమిటీ సభ్యులు అంతదూరం వచ్చి ఎరువులు తీసుకువెళ్లే అవకాశం లేదని చెప్పడం వలన ఇవ్వడం లేదన్నారు. మండలాల్లోని సహకార సంఘాల ద్వారా ఎరువులు ఇచ్చే అవకాశం పరిశీలించాలని రైతులు కోరారు.

టెక్సాస్ నుంచి అమలాపురానికి మృతదేహాలు

ఎమ్మెల్యే పొన్నాడను ఓదార్చిన నాయకులు

అమలాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని జాన్సన్ కౌంటీలో గల 67వ జాతీయ రహదారిపై గత నెల 26న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అమలాపురం పట్టణానికి చెందిన ఐదుగురు మృతిచెందడంతో వారి మృతదేహాలను మంగళవారం ఉదయం అమలాపురం తీసుకువచ్చారు. మృతులు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ చిన్నాన్న పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు కావడంతో పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఎమ్మెల్యే పొన్నాడ స్వగృహానికి మృతదేహాలను తరలించారు. వందలాది మంది అభిమానులు, రాజకీయ నాయకులు ఎమ్మెల్యే సతీష్ స్వగృహానికి తరలివచ్చి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సతీష్‌తో సహా కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. చిన్నారుల మృతదేహాలు సైతం అక్కడ చూపరులను కంటతడి పెట్టించాయి. కాగా జాన్సన్ కౌంటీలో ఉన్న 67వ నంబరు హైవేపై పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న వాహనాన్ని గత ఏడాది డిసెంబరు 26న ఓ ట్రక్కు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు స్వయానా చిన్నాన్న అయినా పొన్నాడ నాగేశ్వరరావు(68), అతని భార్య సీతామహాలక్ష్మి (64), కుమార్తె పోతాబత్తుల నవీనగంగ(38), ఆమె కుమారుడు కృతిక్(11), కుమార్తె నిషిత(9) ప్రమాద స్థలిలోనే మృత్యువాత పడిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను అమెరికాలోని తానా సభ్యుల సహకారంతో సోమవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తీసుకుని వచ్చి అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్సుల్లో అమలాపురం తరలించారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ స్వగృహం వద్ద పెద్దసంఖ్యలో రాజకీయపార్టీల ప్రముఖులు, అభిమానులు మృతదేహాలను సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు వైసీపీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు నివాళులర్పించారు. అనంతరం రాజమహేంద్రవరంలోని కోటిలింగాల శ్మశాన వాటికకు మృతదేహాలను తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ నాగేశ్వరరావు అల్లుడు పోతాబత్తుల లోకేశ్ అమెరికాలో చికిత్స పొందుతున్నారు. నివాళులర్పించిన వారిలో వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి బాబు, దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, పెన్మెత్స చిట్టిరాజు, బిళ్ల మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే పొన్నాడను ఓదార్చుతున్న మంత్రి వేణు

న్యాయం చేయలేని పోలీస్‌స్టేషన్లు ఎందుకు?

వృద్ధురాలిపై దాడి చేస్తే చర్యలు తీసుకోరా?

పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం

అనపర్తి, జనవరి 2: రంగంపేట మండలం సుభద్రంపేటలో వృద్ధురాలు ఆమె బంధువులపై జడ్పీటీసీ చేసిన దాడిపై నేటి వరకూ కనీసం విచారణ కూడా చేయలేదని అధికార పార్టీకి కొమ్ము కాస్తూ సామాన్యులకు న్యాయం చేయలేని పోలీస్ స్టేషన్లు ఎందుకని వాటికి తాళాలు వేయండి అంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 26వ తేదీన తనకు రుణం మంజూరు చేయలేదని అడిగిన వృద్ధ మహిళ వాడపల్లి నాగమణిపైన ఆమె కోడలిపైనా దౌర్జన్యానికి పాల్పడి రక్తం వచ్చేలా కొట్టిన జడ్పీటీసీ పేపకాయల రాంబాబుపై నేటికీ రంగంపేట పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి సీఐ శివగణేష్‌కు ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగి వారం గడుస్తున్నా కనీసం సంఘటనా స్థలంలో విచారణ కూడా చేయలేదని అధికార పార్టీకి కొమ్ము కాస్తూ సామాన్య ప్రజలను గాలికి వదిలేశారని రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తపై జడ్పీటీసీ రాంబాబు లైంగికంగా వేధింపులకు గురి చేసినా చర్యలు చేపట్టలేదని అన్నారు. ఎస్ఐపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే ఎంత దూరమైనా వెళతామని ప్రైవేటు కేసులు వేసి న్యాయస్థానంలో తేల్చుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్తి దేవ దానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివా సరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి తదితరులున్నారు.



సీఐ శివగణేష్‌ను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి

కాకినాడ

నేడు కాకినాడకు కేంద్ర మంత్రి రాక

కాకినాడ సిటీ, జనవరి 2: కేంద్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల బుధవారం కాకినాడకు రానున్నారు. భీమవరం నుంచి రోడ్డు మార్గం గుండా బుధవారం కాకినాడ జీఆర్‌టీ గ్రాండ్ హటల్‌కు చేరుకోనున్నారు. మత్స్యశాఖ అధికారులు, హేచరీల నిర్వాహకులు, దాణా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమవుతారు. రాత్రికి కాకినాడలో బస చేసి గురువారం ఉదయం విశాఖపట్నం బయలుదేరనున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ

కాకినాడ సిటీ, జనవరి 2: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి బుధవారం కాకినాడ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పోలీస్ మైదానంలో హెలిప్యాడ్ వద్ద బారికేడ్లు ఏర్పాటు, వైద్య శిబిరం స్పందన కౌంటర్ వంటివి పరిశీలించారు. రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, పబ్లిక్ గ్యాలరీ, స్టాల్స్ ఏర్పాటు తదితర పనులను సీఎం పర్యటనల సమన్వయకర్త తలశిల రఘురాం, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ భూదాన యజ్ఞ బోర్డు ఛైర్మన్ తాడి విజయ్ భాస్కర్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు ఛైర్మన్ దవులూరి దొరబాబు, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావు, జడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, డీఎంహెచ్‌వో జె.నరసింహనాయక్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హరిప్రసాద్‌బాబు, మెప్మా పీడీ బి.ప్రియంవద, జిల్లా ఫైర్ ఆఫీసర్ సురేంద్ర ఆనంద్, ఆర్డీవో పీవీ సాయిప్రసాద్, వివిధ జిల్లాస్థాయి అధికారులు ఉన్నారు.

వాహనాల రాకపోకల మళ్లింపు

కాకినాడ క్రైం: సీఎం జగన్ కాకినాడ పర్యటన సందర్భంగా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనాల రాకపోకల దారి మళ్లింపు ఉంటుందని కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీ మొగలి వెంకటేశ్వర్రావు కోరారు. కాకినాడ పరిసర ప్రాంతాలైన ఇంద్రపాలెం బ్రిడ్జి, మాధవపట్నం సెంటర్, అచ్చంపేట జంక్షన్, వాకలపూడి ఏరియా, అన్నమ్మఘాటి సెంటర్, ఉప్పలంక సెంటర్ ప్రాంతాల నుంచి ఏ భారీ వాహనాలు ఉదయం 7 నుంచి మధ్యహ్నం 2 గంటల వరకు కాకినాడ పట్టణ పరిధిలోనికి అనుమతించబోమని, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నిత్యావసరాలు సకాలంలో పంపిణీ చేయాలి : జేసీ

కాకినాడ సిటీ, జనవరి 2: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఎండీయూ వాహనాల ద్వారా అందించే నిత్యావసర సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని జేసీ ఎస్.ఇలక్కియ ఎండీయూ వాహనదారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడలోని పేర్రాజుపేట, గొడారిగుంటలో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. బియ్యం, ఇతర సరుకుల తూకం, ధర, నాణ్యతలను పరిశీలించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీలో ఆ క్లస్టర్ పరిధిలో వలంటీర్లు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయడంతో పాటు ముందుగానే కార్డుదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ.ప్రసాద్, ఎంఎస్‌వోలు ఉన్నారు.

'ఆలయాల అభివృద్ధికి చర్యలు'

కరప, జనవరి 2: కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధి పరిచేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. పెనుగుదురు గ్రామదేవత పాళమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా మంగళవారం పూజా కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొని మాట్లాడారు. పాళమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేశామన్నారు. గ్రామ సర్పంచ్ రెడ్డిపల్లి వెంకట మాధవి, రమేష్, ఎంపీటీసీ బండారు సుజాత, వెంకటేశ్వరరావు ఆలయ ఉత్సవ కమిటీ ఆలయాన్ని నిర్మించారన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీ విద్య, సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, రమేష్ తదితరులు గ్రామపెద్దల దంపతులు పూజాదికాలు నిర్వహించారు. జడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప మార్కెట్ ఛైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి మాచర్రావు, బండారు సతీష్, దేవాదాయ శాఖ ఈవో పీవీఎస్ సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి'

ప్రత్తిపాడు, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్స్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ప్రతినిధులు బుగతా శివ, అవసరాల దేవి డిమాండ్ చేశారు. చినశంకర్లపూడిలోని సగర్ల రామాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రైతు సంఘాలు, గ్రామస్తుల సమావేశానికి మాజీ ఉపసర్పంచ్ ఏపూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా దేవి, శివ మాట్లాడుతూ ఈ యాక్ట్ వల్ల సామాన్యులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి నియోజకవర్గ కన్వీనర్ శ్రీను, జిల్లా మాన హక్కుల సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాస రెడ్డి, స్థానిక పెద్దలు చెల్లుబోయిన బుజ్జి, ఏపూరి రాంబాబు, సీ.నాగేశ్వరరావు, షేక్ సుభ ఉన్నారు.

'ఆదిత్య'లో నైపుణ్య శిక్షణా సదస్సు

గండేపల్లి, జనవరి 2: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ అకాడమీ విశాఖపట్నం వారి పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణా సదస్సు అవగాహన ఒప్పందం జరిగింది. సీఎస్‌సీ అకాడమీ సలహాదారు వై.రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ అవగాహన పత్రాలను మార్చుకున్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికత మీద సీడాన్, ఐఈఈఈ ద్వారా ఎస్‌ఈ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధ్యాయులకు విద్యార్థులకు నిలిట్ ద్వారా త్రీడి ప్రింటింగ్, రోబోటిక్‌ప్రొసెసింగ్‌మీ, పారిశ్రామిక వ్యవస్థాపక శిక్షణ అందిస్తామని కన్సల్టెన్సీ వై.రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో పుల్లెల ఆర్‌కుమార్, మధు, మాణిక్యకుమార్ పాల్గొన్నారు.

కోటి మట్టి శివలింగాల తయారీ

జగ్గంపేట, జనవరి 2: జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరునది తీరాన వేంచేసిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద నిర్వహించ తలపెట్టిన మహా కుంభాభిషేకం కోసం కోటి మట్టి శివలింగాల తయారీలో జె.కొత్తూరు గ్రామం నుంచి 50 మంది మహిళలు వెళ్లి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణి, జ్యోతుల లక్ష్మీదేవి, తోట సునీత, అనీష్ నెహ్రూ, తెలుగు యువత ఉపాధ్యక్షుడు బద్ది సురేష్, జె.కొత్తూరు గ్రామ మహిళా అధ్యక్షురాలు తిప్పన సత్యవతి, బద్దిసత్యవతి, గూడుపు చెల్లయమ్మ, అడపా అమ్మాజీ, నకిరెడ్డి సత్యవతి, నక్క రామలక్ష్మి ఉన్నారు. భక్తులకు అయోధ్య రాముడి అక్షింతలను జ్యోతుల మణి, లక్ష్మీదేవి అందజేశారు.

బాలరాముని అక్షింతల పంపిణీ

సామర్లకోట, జనవరి 2: సామర్లకోట కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం అయోధ్య బాలరాముని అక్షింతల పంపిణీ సామర్లకోట విశ్వ హిందూపరిషత్, హిందూ ఐక్యవేదికల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించగా సనాతన గీతా ప్రచారకులు మల్లికార్జున స్వామి పాల్గొన్నారు. ముందుగా మహిళాభక్తులతో ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. కర్రి ఆదినారాయణ రెడ్డి, బొడ్డు హరికృష్ణ, కాపగంటి పైడిరత్నం, కటకం సృజన్, మార్ని రాంబాబు, బిక్కిన రాజా, యార్లగడ్డ అక్కిరాజు, వల్లూరి బుల్లియ్య, యార్లగడ్డ శ్రీను, జీవీకె. మోహనరావు పాల్గొన్నారు.

వీవోఏ నూతన కార్యవర్గం ఎంపిక

తాళ్లరేవు, జనవరి 2: తాళ్లరేవు మండల వీవోఏ (యానిమేటర్లు) సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సీఐటీయూ నాయకురాలు కస్సిడి మంగామణి అధ్యక్షతన ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా కమిడి ఈశ్వరీబాయి, ఉపాధ్యక్షురాలు బల్ల జాన్సీ, కార్యదర్శి మోర్త వెంకటరమణ, సహాయకార్యదర్శి కొక్కిలిగడ్డ నాగమణి,కోశాధికారిగా చెల్లి దుర్గలను ఎంపిక చేసినట్టు తెలిపారు.

సామూహిక లక్ష తులసి పూజ

తాళ్లరేవు, జనవరి 2: తాళ్లరేవు కేశవస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక లక్ష తులసి, కుంకుమ, లక్ష తమలపాకుల, సింధూర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో 25మంది రుత్వికులతో పూజలు చేయించారు. ఈవో ఎర్ర వెంకటేశ్వరరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొల్లు శ్రీను, బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, చిట్టూరి చలపతి, గంజా సూరిబాబు, మేడిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

రౌతులపూడి, జవవరి 2: ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గంటా బాలుదొర అద్వర్యంలో మండలాధ్యక్షుడు ఉటా నాగశ్రీను అధ్యక్షత బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శక్తి కేంద్ర జోనల్ ఇన్‌చార్జి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కిషాన్ మోర్చా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, చిట్రాపాపారావు, యాదగిరి వెంకటరమణ (శ్రీను) పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: డెవిల్, బబుల్‌గమ్, యానిమల్, హాయ్ నాన్న, ఆక్వామెన్

తిరుమల	:	డెవిల్
లక్ష్మి	:	డెవిల్
సీ అండ్‌సీ1	:	ఆక్వామెన్
సీ అండ్‌సీ2	:	సలార్
శ్రీప్రియ	:	యానిమల్
పద్మప్రియ	:	సలార్
సత్యగౌరి	:	సలార్
సూర్య 1	:	ఆక్వామెన్
సూర్య 2	:	సలార్

సంక్రాంతి సంబరాలు

కాకినాడ సిటీ, జనవరి 2: కాకినాడ గాంధీనగర్‌లో గల క్షత్రియ పరిషత్‌లో మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. రంగవల్లి పోటీలు, పిండి వంటల పోటీల్లో మహిళలు పాల్గొన్నారు. పిల్లలకు భోగి పళ్ల వేశారు. భోగి మంటలు, గంగి రెద్దుల సందడి, పొంగునూరు ఆవులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి రామకృష్ణ భాస్కరరాజు, కార్యదర్శి వీ.వర్మ, మహిళా అధ్యక్షురాలు పెన్మెత్స పార్వతి, దేవి వర్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసనలు

ప్రభుత్వం పట్టించుకోవడంలేదని

దున్నపోతులకు వినతులు




రౌతులపూడి, తాళ్లరేవులో దున్నపోతులకు వినతిపత్రాలు అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

పిఠాపురం, జనవరి 2: ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మంగళవారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. పిఠాపురం తహశీల్దారు కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు దున్నపోతుకు వినతిపత్రం అందజేసి ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ బుధవారం నిర్వహించే ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంచాలని, హెల్పర్ల పదోన్నతి వయస్సును 50ఏళ్లకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి బి.తులసిదేవి, విజయశాంతి, సీఐటీయూ నాయకులు కుంచే చిన్నా, నందీశ్వరరావు, ప్రజావాణి, సత్యవతి, వెంకటలక్ష్మి, భవానీ, నళిని, అమల పాల్గొన్నారు.

రౌతులపూడి: రౌతులపూడిలో అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలియజేశారు. తమకు రూ.26వేలు వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సత్యవేణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి బస్టాండ్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల మండలాధ్యక్షురాలు రత్నం ఆధ్వర్యంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమ్మె చేయగా మద్దతు తెలిపారు. దున్నపోతుకు వినతి ఇచ్చారు.

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన దీక్ష (సీఐటీయూ) ఆధ్వర్యంలో 22వ రోజుకు చేరుకుంది. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు దారపురెడ్డి క్రాంతికుమార్, దాడి బేబీ, నాగమణి, పద్మ, సావిత్రి, స్నేహకుమారి, యూనియన్ నాయకులు ఉన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో అంగన్‌వాడీల రిలే దీక్ష 22వ రోజుకు చేరింది. మంగళవారం యూటీఎఫ్ నాయకులు, పలు సంఘాలు మద్దతు పలికారు.

తాళ్లరేవు: 22రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం దున్నపోతుమీద వర్షం కురిసినట్లు వ్యవహరిస్తుందని తాళ్లరేవులో అంగన్‌వాడీలు దున్నపోతుకు మంగళవారం వినతిపత్రం అందించారు. నిరసనలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోకి ఉచిత అంతిమయాత్ర వాహనం



పిఠాపురంలో అంతిమయాత్ర వాహనాన్ని అందజేస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, జనవరి 1: పట్టణంలోని మన ఊరు - మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మరో అంతిమయాత్ర వాహనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మృతదేహాలను అంతిమసంస్కారాలు నిమిత్తం తీసుకెళ్లే వారికి ఈ వాహనాన్ని ఉచితంగా ఇస్తారు. మల్లాం గ్రామానికి చెందిన దాత వెన్నపు చక్రధరరావు సమకూర్చిన ఈ అంతిమయాత్ర వాహనాన్ని ప్రజలకు అంకితం చేస్తూ సంస్థ ప్రతినిధులకు విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అందజేశారు. అంతిమసంస్కారాల కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉచితంగా వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన సంస్థ ప్రతినిధులు, దాత చక్రధరరావులను ఉమర్‌ఆలీషా అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా పంతం వెంకటరమణ అందించిన అంతిమయాత్ర వాహనం ప్రజలకు అందుబాటులో ఉండేదన్నారు. అది మరమ్మతులకు గురికావడంతో వెన్నపు చక్రధరరావు కొత్త వాహనాన్ని సమకూర్చారన్నారు. ప్రజలు ఈ వాహన సేవలను వినియోగించుకోవచ్చని కోరారు.

పి.వెంకటాపురంలో 'ఆరోగ్య సురక్ష'

సర్పవరం జంక్షన్, జనవరి 2: నిరుపేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం జాయింట్ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహరావు, డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ రత్నాకరరావు కోరారు. మంగళవారం పండూరు సచివాలయం పి.వెంకటాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్లు రవికుమార్, శ్రీనివాస్, స్రవంతి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంకే అమ్మాజీ, ఉప సర్పంచ్ పెంకే సోమరాజు, గ్రామ కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, ఈవోపీఆర్డీ ఏఎన్‌ఎంలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరపలో...

కరప: స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన జగన్న సురక్ష ప్రారంభించారు. జడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి మాట్లాడారు. డీఎంహెచ్‌వో జె.నరసింహనాయక్ శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. కరప పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో 316 మందికి పరీక్షలు చేసి మందులు పంచారు.

5 నుంచి 10 వరకు రేచెర్లపేట రైల్వే గేటు మూసివేత

కాకినాడ సిటీ, జనవరి 2: రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 5వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 10వ తేదీ రాత్రి 7 గంటల వరకు కాకినాడ నగరంలోని రేచెర్లపేట రైల్వే గేటును మూసివేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే కాకినాడ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించి భానుగుడి ఆర్‌వోబీ, సాంబమూర్తినగర్ ఆర్‌వోబీల మీదుగా రాకపోకలు సాగించాలని కోరారు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యామ్నాయ రాకపోకల ఏర్పాట్లు చేయాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి, కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీ, కార్పొరేషన్ కమిషనర్‌లకు నోట్ పంపారు. అదేవిధంగా లారీ యూనియన్, ఆటో యూనియన్, స్కూల్ బస్ అసోసియేషన్‌లకు సమాచారం అందించారు.

12న ఎస్టీయూ వజ్రోత్సవం

కొత్తపల్లి, జనవరి 2: కర్నూలులో ఈనెల 12,13న జరిగే ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఎస్టీయూ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం వజ్రోత్సవ వేడుకల పోస్టర్లను కొత్తపల్లి ఎంఈవోలు, బుర్రా వేణుగోపాల్, పైడిరాజు ఆవిష్కరించారు. కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ ఎత్తున నిర్వహించే వేడుకలకు ఎస్టీయూ కార్యకర్తలు విధిగా హాజరుకావాలని మండల ఎస్టీయూ ప్రతినిధులు పిలుపిచ్చారు. ఎస్టీయూ అధ్యక్షుడు పెనుమల్లు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.లలితకుమారి, రాష్ట్ర కార్యదర్శి యు.శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సంఘీభావం

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 2: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని కాకినాడ బార్ అసోసియేషన్ బిల్డింగ్ వద్ద న్యాయవాదులు చేపట్టిన నిరసన శిబిరాన్ని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, సిటీ ఇన్‌చార్జి ముత్త శశిధర్ మంగళవారం సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఇది వ్యవస్థలను వ్యక్తులను గుప్పెట్లో పెట్టుకుని ఆడించే వంకర నిర్ణయమని, దీనిని జనసేన వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజావ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలని కోరారు.



న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కార్మికుల నిరసనలు



పెద్దాపురంలో ఒంటికాలిపై కార్మికుల నిరసన

పెద్దాపురం, జనవరి 2: తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలియచేశారు. సీఐటీయూ నాయకుడు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేవరకూ సమ్మెను విరమించేది హెచ్చరించారు. శివకోటి అప్పారావు, వర్రే గిరిబాబు, భూపతి శ్రీను, రాజేష్ కృష్ణ, సీఐటీయూ నాయకులు ఉన్నారు.

గొల్లప్రోలు: కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె ఏడవ రోజుకి చేరింది. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన దీక్షలు చేపట్టారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కరోనా సమయంలో పనిచేసిన కార్మికులకు 6నెలల వేతనం చెల్లించాలని, రిటైర్మెంట్స్ బెనిఫిట్స్ చెల్లించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బి.సతీష్, రాజులు, సీహెచ్ రాజమోహన్, రావులమ్మ, పార్వతి, సీఐటీయూ నేతలు ఉన్నారు.

నేటి నుంచి సామర్లకోటలో...

సామర్లకోట, జనవరి 2: బుధవారం నుంచి సామర్లకోట మున్సిపల్ రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ వర్కర్సు సమ్మె ప్రారంభించనున్నట్టు సామర్లకోట యూనియన్ అధ్యక్షుడు బొచ్చా శ్రీను తెలిపారు. సీఎం జగన్ తమకిచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు మల్లిపూడి లక్ష్మి, కె.కిషోర్, మిరియాల పెద్ద, చెన్నా వెంకటేశ్వర్లు, చిడతా వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉరితాళ్లతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉగ్యోగులు

కాకినాడ సిటీ, జనవరి 2: విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగులను విలీనం చేసి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీప్రకారం ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని మెడకు ఉరితాళ్లు తగిలించుకుని సమగ్ర శిక్షా ఉగ్యోగులు నిరసన తెలిపారు. స్థానిక ధర్నాచౌక్ వద్ద మంగళవారం 14వ రోజుకు చేరిన సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షకార్యదర్శిలు ఎం.చంటిబాబు, సత్యనాగమణి మాట్లాడారు. సమగ్ర శిక్షా నిర్వహణ కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు కేటాయించాల్సి ఉందని, అయితే నాలుగేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులన సైతం పక్కదారి పట్టించి ఉద్యోగుల వేతనాలు విడుదల చేయకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఉద్యోగులు చావో రేవో తేల్చుకునే వరకు పోరాటాన్ని విరమించేదిలేదరని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు జి.నారాయణ, శ్రీనివాస్, పి.రాజు, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, జనవరి 2: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సొంతకుటుంబం కంటే అధిక సమయం ప్రజల కోసం వెచ్చించానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2006 నుంచి నేటి వరకూ 18 ఏళ్లుగా ఈ నియోజకవర్గ బిడ్డగా గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉన్నానని చెప్పారు. ఏ రోజు నియోజకవర్గ ప్రజలను వదిలి తాను ఎక్కడికి వెళ్లలేదని తెలిపారు. అన్నివర్గాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గాన్ని రూ.2,800 కోట్లతో అభివృద్ధి చేశానని, 80శాతం సీసీ రోడ్లు నిర్మించానని తెలిపారు. రాబోయో రోజుల్లో నూరుశాతం సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఉప్పాడ సముద్ర తీరాన్ని కోత నుంచి రక్షించేందుకు జియోట్యూబ్ నిర్మాణం చేపడతామని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ పట్టణా ధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి ప్రకాష్, దేవరపల్లి రామారావు, అల్లవరపు నగేష్, నల్లా శ్రీను, మసకపల్లి రాజా, బొజ్జా సతీష్, కోడిగుడ్ల పెద్ద, రెడ్డెం రాజబాబు తదితరులున్నారు.

తీరంలో మృత్యువాత పడుతున్న తాబేళ్లు



ఉప్పాడ తీరంలో చనిపోయిన తాబేలు

ఉప్పాడ (కొత్తపల్లి), జనవరి 2: ఇటీవల ఉప్పాడ నుంచి కాకినాడ వరకు ఉన్న తీరంలో సముద్ర తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. సముద్రంలో జీవించే తాబేళ్లు గుడ్లు పెట్టే దశలో ఒడ్డుకు వస్తుంటాయి. ఒడ్డుకు వచ్చి ఇసుకలో ఏర్పాటుచేసు కొన్న గొయ్యిలో తాబేళ్ళు గుడ్లుపెట్టి మళ్లీ సముద్రంలోపలికి వెళ్లిపోతాయి. ఇలా వెళ్లే క్రమంలో నక్కల బారిన పడి చనిపోతున్నాయని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. అధిక సంవత్సరాలు జీవించ కలిగిన తాబేళ్ల కేవలం గుడ్లు పెట్టే దశలో మృతిచెందడం పట్ల మత్స్యకారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వాటి సంతతిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'రజకుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 2: రాష్ట్రవ్యాప్తంగా రజకులు అనేక సమస్యలతో సతమతవుతున్నారని గుర్తించిన జనసేనాని పవన్‌కల్యాణ్ వాటిని పరిష్కరించేందుకు అత్యంత ప్రాదాన్యత చూపుతున్నారని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, సిటీ ఇన్‌చార్జి ముత్త శశిదర్ అన్నారు. మంగళవారం ట్రెజరి కాలనీలోని రజకప్రాంతంలో ఆయన పర్యటించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో దోబిఖానా నిర్మిస్తానని చెప్పి నిర్మించకపోవడం వల్ల నీళ్లు చాలా దూరం నుంచి తెచ్చుకోవలసిన దుస్థితి ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే దుస్తులు ఉతికిన తరువాత ఆరవేయడానికి స్థలంలేకపోవడం వల్ల వాయిదాలపై ఉతుక్కోవలసి వస్తుందని తెలిపారు. శశిదర్ మాట్లాడుతు వైసీపీ ప్రభుత్వం సమస్యలు వదిలి మాయమాటలు మాత్రమే చెబుతుందని బీసీ కార్పొరేషన్ ద్వారా ఆదుకోవలసినా నిధులు విడుదల చేయకపోగా నిర్వీర్యం చేసిందన్నారు. 43వ డివిజన్ ఇన్‌చార్జి చోడిశెట్టి శ్రీమన్నారాయణ, నరం మణికంట పాల్గొన్నారు.

స్క్వాష్ జట్టు ఎంపికలు



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కాకినాడ అర్బన్, జనవరి 2: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల జిల్లా ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్క్వాష్ రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో మంగళవారం ప్రారంభించారు. అండర్ 14, 17,19 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించగా 48మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో 24మందిని ఎంపిక చేశారు. వారంతా ఈనెల 13 నుంచి 16 వరకు పూణేలో జరిగే 67వ స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బీవీ.ప్రసాద్ తెలిపారు. డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, శివరామకృష్ణ, పట్టాభిరామ్, శ్రీహరిరాజు, హుస్సేన్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గెడ్డం సాయికి సత్కారం



ప్రత్తిపాడు, జనవరి 2: మండలంలో ధర్మవరం అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గెడ్డం సాయిని మంగళవారం ఎంఈవో వి.రాజబాబు, ఎంఈవో2 వై.అచ్చిరాజు సన్మానించి అభినందించారు. రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలోని వ్యక్తిగత విభాగంలో సాయి రూపొందించిన రిమోట్ కంట్రోల్ అగ్రికల్చర్ మిషన్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఎంఈవోలు హైస్కూల్ సందర్శించి గెడ్డంని శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, గ్రామపెద్దలు జువ్వల సుజాత బాబులు, జువ్వల చినబాబులు, హెచ్ కె. చినరామమూర్తి, ఉపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు, కె.రాజు, ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ, ఝాన్సీ, ఆకుల సాయికుమార్, గెడ్డం దుర్గామాణిక్యం, చక్రవేణి తదితరులు ఉన్నారు.

88వ సారి రక్తదానం

కరప, జనవరి 2: గ్రామ మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు మంగళవారం 88వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని మరొకసారి చాటుకున్నారు. కరపకి చెందిన పలివెల శివప్రసాద్ కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకోవడంతో తాతీలు కాకినాడ వెళ్లి రక్తదానం చేశారు. తాతీలు ఔదర్యాన్ని పలువురు గ్రామస్తులు అభినందించారు.

కళాశాలకు కంప్యూటర్ల అందజేత

ప్రత్తిపాడు, జనవరి 2: ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహావతార్ బాలాజీ తదేకం ఫౌండేషన్ ముంబై వారి ఆర్థిక సహాయంతో ఉభయగోదావరి జిల్లాల జనసేన పార్టీ కో ఆర్డినేటర్ కదలి ఈశ్వరి చేతులమీదుగా 2 కంప్యూటర్లను అందజేశారు. కళాశాలలో మురుగుదొడ్ల నిర్మాణానికి రూ.70వేలు, రూ.2లక్షలు విలువ చేసే సామాగ్రిని ప్రిన్సిపాల్ డి.సునీతకు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ టి.చిన్నారావు, ప్రయోగమూర్తి, వెంకటేశ్వర్లు, సురేష్, లక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో రామభక్తుల ప్రదర్శన

ప్రత్తిపాడు, జనవరి 2: ఏలేశ్వరంలో మంగళవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామభక్తులు ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ వినాయక ఆలయంలో అయోధ్య అక్షింతలకు పూజలు నిర్వహించి అనంతరం వీహెచ్‌పీ కార్యకర్తలు, మేళతాళాలు, కోటాలాలు, భజనబృందాలతో ఊరేగించారు. క్యాలెండర్, కరపత్రాలు, అక్షింతలను సత్యనారాయణ స్వామి ఆలయ సన్నిధి, పరిసరాల్లో భక్తులకు అందజేశారు.

అన్న సమారాధన

జగ్గంపేట, జనవరి 2: స్థానిక శెట్టిబలిజపేట శివారు ఉన్న ధనసత్తమ్మ గుడి వద్ద సంగిరెడ్డి గన్నియ్య వీర్రాజు దంపతుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వైబోగుల కొండబాబు యాదవ్, సిమ్మ ముత్యాలు, పాలిక వీరబాబు, కార్తిన విజయ్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు, జనవరి 2: ఎస్సీఎస్టీ మైనార్టీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాలెండర్‌ను మంగళవారం ధర్మవరంలో ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా నాయకుడు ఎలిపే రాంజీ ప్రసాద్, ఎంఈవోలు వి.రాజబాబు, వై.అచ్చిరాజు, ప్రధానోపాధ్యాయుడు కె.చినరామ్మూర్తి, సీఆర్పీ గంగాధర్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డివైడర్ పైకి ఎక్కిన కారు

గండేపల్లి, జనవరి 2: మండలంలో బొర్రంపాలెం జాతీయ రహదారిపై మంగళవారం రాజమహేంద్రవరం వైపు నుంచి వైజాగ్ వైపు వెళ్తున్న కారు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పైకి దూసుకువెళ్లడంతో స్థానికలు భయాందోళన చెందారు. ఆ సమయంలో కారులో ఇద్దరు ప్రయాణిస్తుండగా వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ

పెద్దాపురం, జనవరి 2: స్థానిక సీహెచ్‌సీలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు మానవహక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆధ్వర్యంలో దాత రాణీ సహకారంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యకుమారి అందజేశారు. సంఘ సభ్యులు కుంచే నానిబాబు, జుత్తుక అప్పారావు, వల్లీబాషా, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, రమాదేవి, శ్వేత, సుగంధం సాయి పాల్గొన్నారు.